ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా

శనివారం 06 జూన్ 2026 పేజీలు : 8



## వేములవాడలో ట్రాఫిక్ సమస్యలపై అధికారుల ఉమ్మడి తనిఖీ

వేములవాడ (విజన్ ఆంధ్ర) , జూన్ 5:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలో భక్తులు, స్థానిక ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు కలిసి నంది కమాన్ చౌరస్తా వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వ హించారు.

2లో

# భక్తుల భద్రతే లక్ష్యం



## ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం



కరీంనగర్ంవిజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 05. నగర ప్రజలకు మరిన్ని ఆధునిక వసతులు కల్పించడంలో భాగంగా కరీంనగర్ నగరంలో నూతనంగా అధునీకరించిన ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కరీంనగర్ నగరపాలక సంస్థకు చెందిన కాంప్లెక్స్ భవనాన్ని శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ సుడా కు చెందిన 79 లక్షల నిధులతో 48 షాపులుగా అధునీకరించిన ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ను శుక్రవారం రోజు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వడ్లూరు లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, స్థానిక శాసనసభ్యులు గంగుల కమలాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వనీ తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రారంభం చేశారు.

8లో

### ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు

## రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లా కలెక్షర్ చిత్ర మిశ్రా
ఈ.వి. ఎమ్ గోదాం తనిఖీ



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్05 స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వ హించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు.

8లో

## చిన్నారుల కిలకిలలు..!!

## సర్కారు బడుల కళకళలు



4లో

# భక్తుల భద్రతే లక్ష్యం..

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గన్ పార్క్‌లో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, జూన్ 5 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో):
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణ కేంద్రంలోని గన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ సూచించారు.పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు

## వేములవాడలో ట్రాఫిక్ సమస్యలపై అధికారుల ఉమ్మడి తనిఖీ



వేములవాడ (విజన్ ఆంధ్ర) , జూన్ 5:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలో భక్తులు, స్థానిక ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు కలిసి నంది కమాన్ చౌరస్తా వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వ హించారు.పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే నంది కమాన్ చౌరస్తా పరిసరాల్లో వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను అధికారులు పరిశీలించారు. రహదారులపై ఏర్పడిన ఆక్రమణలు, తోపుడు బండ్లు, పండ్ల దుకాణాల వల్ల వాహనదారులు, కాలినడకన వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు.ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడిన చైర్మన్ పుల్కం రాజు, ప్రజల భద్రత దృష్ట్యా రోడ్లపై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. పట్టణ సుందరీకరణతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వ్యాపారులు సహకరించాలని కోరారు.చైర్మన్ మాట్లాడుతూ, వేములవాడకు ప్రతిరోజూ వేలాది మంది భక్తులు, వాహనాలు వస్తుండటంతో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా శాస్త్రీయ పద్ధతిలో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరికల సైన్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ జామ్‌లు తగ్గించే చర్యలు చేపడతామని తెలిపారు.ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ శాశ్వత నివారణ చర్యలు చేపట్టేందుకు మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బి శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వేములవాడను సురక్షితమైన, సుందరమైన ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కాశ శ్రీనివాస్, కమిషనర్ లోకేష్, మారుపాక సర్పంచ్ దొబ్బల మల్లేశం, టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీస్ శాఖ మరియు ఆర్ అండ్ బి శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంజన్న చెంత చొప్పదండి ఎమ్మెల్యే పూజలు



మల్యాల, జూన్ 05 (విజన్ ఆంధ్ర):
జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ అంజనేయస్వామి వారిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన జన్మ దినాన్ని పురస్కరించుకొని ఈరోజు కుటుంబ సభ్యులు, పెద్దసంఖ్యలో వచ్చిన అనుచరులు, కార్యకర్తలతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లోకి చేరుకున్న ఎమ్మెల్యేకు దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన పుట్టినరోజు నాడు అంజన్న స్వామివారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని, మనసుకు ఎంతో ప్రశాంతతను ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, మన రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా అభివృద్ధి చెందాలని ఆంజనేయస్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.?దర్శనానంతరం ఆలయ మండపంలో ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేకు వేద మంత్రోచ్ఛారణలతో వేదాశీర్వచనం గావించారు. స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, తీర్థప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.?ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు సునీల్, చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్, ఉప ప్రధాన అర్చకులు మారుతి ప్రసాద్, చిరంజీవి, ముఖ్య అర్చకులు లక్ష్మణ్ ప్రసాద్, అభిలాష్‌లతో పాటు స్థానిక ఎస్సై నరేష్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



## ప్రయాణికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### కొదురుపాక, వెంకట్రావుపల్లిలో సీపీఎం నిరసన

బోయినపల్లి (విజన్ ఆంధ్ర బ్యూరో ) జూన్ 5:
బోయినపల్లి మండలంలోని కొదురుపాక, వెంకట్రావుపల్లి గ్రామాల వద్ద ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బస్సు షెల్టర్లు, మరుగుదొడ్ల నిర్మాణాలను అత్యవసరంగా చేపట్టాలని మండల సీపీఎం కన్వీనర్ గురిజాల శ్రీధర్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎన్నికై మూడేళ్లు గడుస్తున్నప్పటికీ గ్రామాల అభివృద్ధిపై సరైన దృష్టి సారించలేదని విమర్శించారు. కొదురుపాక రౌండప్ బోర్డు ప్రాంతాన్ని సుందరీకరించడంతో పాటు కొదురుపాక, వెంకట్రావుపల్లి స్టేజీల వద్ద ఆధునిక బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలని, ప్రస్తుతం కనీస వసతులు లేకపోవడంతో మహిళలు ఎండలో, వర్షంలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే మహిళలను సమీకరించి భారీ స్థాయిలో ఆందోళనలు చేపట్టి రహదారులను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి అవసరమైన స్థల సేకరణ పూర్తి చేసి అభివృద్ధి పనులను ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రామంచ అశోక్, మండల నాయకులు కుడుకల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు

## సిరిసిల్లలో నంబర్ ప్లేట్ల తొలగింపుపై పోలీసుల ప్రత్యేక డ్రైవ్



రాజన్న సిరిసిల్ల బ్యూరో , జూన్ 5 (విజన్ ఆంధ్ర):
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ తొలగింపు, నంబర్ ప్లేట్ మార్ఫింగ్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నంబర్లు స్పష్టంగా కనిపించకుండా వాహనాలు నడుపుతున్న 20 వాహనాలను గుర్తించి జరిమానాలు విధించడంతో పాటు, ఆయా వాహన యజమానుల ద్వారా వెంటనే నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, వాహనాలకు నంబర్ ప్లేట్ తొలగించడం లేదా నంబర్లు కనిపించకుండా మార్ఫింగ్ చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఇటువంటి ఉల్లంఘనలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరించారు.ప్రతి వాహనదారుడు తన వాహనానికి నంబర్ ప్లేట్‌ను స్పష్టంగా కనిపించే విధంగా తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సరైన నంబర్ ప్లేట్లు ఉండటం వల్ల దొంగిలించబడిన వాహనాలను గుర్తించడం, నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు.నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్ ప్లేట్‌కు అడ్డుగా వస్తువులు ఏర్పాటు చేసి లేదా నంబర్లు పూర్తిగా కనిపించకుండా, సగం నంబర్లు తొలగించి వాహనాలు నడిపితే చీటింగ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. “నంబర్ ప్లేట్ స్పష్టంగా ఉండాలి… భద్రతకు అది మొదటి గుర్తింపు” అని పోలీసులు ప్రజలకు సూచించారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### -ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత

గోదావరిఖని జూన్-05(విజన్ ఆంధ్ర)



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతిని కాపాడడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించవచ్చని ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం ౘ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ అవగాహన ర్యాలీని ప్రారంభించి, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు,సంఘాల ప్రతినిధులు, గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ ( జేఈఎం) విద్యార్థినులు, కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు స్థానిక దుకాణదారులకు వస్త్ర సంచులను పంపిణీ చేయడంతో పాటు, పర్యావరణ అంశాలపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. టౌన్‌షిప్‌లో నిర్వహించిన సామూహిక వృక్షారోపణ కార్యక్రమంలో 200 మొక్కలు, తెలంగాణ సీహెచ్‌పీ కోల్ భవన్‌లో 100 మొక్కలు నాటారు. అదేవిధంగా తెలంగాణ యాష్ డైక్ వద్ద మియావాకి పద్ధతిలో 1,000 మొక్కలతో ప్రత్యేక అటవీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొత్తం 1,300 మొక్కలను నాటినట్లు అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి వ్యక్తి భాగస్వామ్యం కావాలని, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, సహజ వనరులను సంరక్షించడం ద్వారా ప్రకృతిని కాపాడవచ్చని చందన్ కుమార్ సమంత పేర్కొన్నారు. హరితాభివృద్ధి, పర్యావరణ సమతుల్యత కోసం ఎన్టీపీసీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.


## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఆర్యవైశ్య మహాసభ ఘన సన్మానం




వేములవాడ (విజన్ ఆంధ్ర బ్యూరో), జూన్ 5:

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న పాత్రికేయుల సేవలు అమూల్యమైనవని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బుస్స దశరథం అన్నారు. శుక్రవారం వేములవాడలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఉపాధ్యక్షుడు దేవరాజ్ తో పాటు నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బుస్స దశరథం మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేసే జర్నలిస్టులు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సన్మానానికి స్పందించిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, తమ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం, ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌తో పాటు సంఘం ప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు కొత్వాల్ శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు రసూల్, ఉపాధ్యక్షులు విష్ణు, జిల్లా సభ్యులు కంటాల విజయ్, క్యాషియర్ పంపరి నాగరాజు, దెబ్బేటి ప్రవీణ్, సందీప్, ఆర్యవైశ్య మహాసభ సభ్యులు చికోటి అశోక్, బుస్స బుచ్చిబాబు, దైత కుమార్, ఆర్యవైశ్య నాయకులు చేపూరి రవీందర్, చేపూరి గణేష్, వాసవి క్లబ్ గవర్నర్ నరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## వేములవాడలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ





వేములవాడ (విజన్ ఆంధ్ర), జూన్ 5:

ప్రజల ఉపాధి, ఉద్యోగ పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని సేకరించే లక్ష్యంతో జాతీయ గణాంక శాఖ చేపడుతున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (ఫ్రాఖీూ) ను వేములవాడలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న సర్వేలో భాగంగా వేములవాడలో ఆయన స్వయంగా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్‌ను ఆయన కార్యాలయంలో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేసి, సర్వే ప్రాముఖ్యతను వివరించారు. ఈ సర్వే ద్వారా ప్రజల విద్యా అర్హతలు, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి, వేతనాలు, వృత్తి నైపుణ్యాలు, నిరుద్యోగ స్థితి వంటి అంశాలపై సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. పట్టణాలు, గ్రామాల నుంచి ఎంపిక చేసిన కుటుంబాల వద్ద మొదట సాధారణ వివరాలు నమోదు చేసి, అనంతరం ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెల సందర్శించి పూర్తి స్థాయి సర్వే నిర్వహిస్తామని చెప్పారు. కుటుంబ సభ్యుల విద్యా స్థాయి, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని గంటలు, ఆదాయం వంటి వివరాలతో పాటు మహిళల స్వయం ఉపాధి కార్యకలాపాల సమాచారాన్ని కూడా సేకరిస్తామని పేర్కొన్నారు. అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫారమ్ వర్కర్ల ఉపాధి వివరాలను కూడా నమోదు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, మేనేజర్ సంపత్ రెడ్డి, ఎంపీఎస్ఓ తిరుపతి, కార్పొరేటర్ అన్నారం శ్రీనివాస్, వార్డు అధికారి రోజా, బిల్ కలెక్టర్ ముంజ రమేష్ గౌడ్, మెప్మా సిబ్బంది వరాల శోభ, పోసు మంజులతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

గోదావరిఖని జూన్-05(విజన్ ఆంధ్ర)



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరిఖనిలోని అదనపు జిల్లా న్యాయస్థానం ఆవరణలో శుక్రవారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ప్రధాన జిల్లా మరియు సెషన్స్ జడ్జి సునీత కుంచాల, ఇతర జడ్జిలు, సెషన్స్ జడ్జిలు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ప్రాంగణాల్లో లేదా ప్రత్యేక క్యాంపులలో మొక్కలు నాటడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ, చెట్లు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భూమిపై జీవకోటి మనుగడకు స్వచ్ఛమైన పర్యావరణం ఎంతో అవసరమని, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం అని అన్నారు. పెరుగుతున్న పర్యావరణ సమస్యలను ఎదుర్కొనేందుకు చెట్ల పెంపకం, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు ప్రతి వ్యక్తి తన జీవితకాలంలో కనీసం ఐదు చెట్లను నాటి వాటిని సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణకు గణనీయమైన తోడ్పాటు అందించిన వారవుతారని జిల్లా జడ్జి సునీత సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్ రెడ్డి ,1,2 వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ లు స్వారిక,శ్రీనిజ కోహిల్కర్ తో పాటు బార్ కౌన్సిల్ సభ్యురాలు చందాల శైలజ,బార్ అసోసియేషన్ ప్రతినిధులు గుజ్జెటి సత్యనారాయణ, కుడిది వెంకటేష్, గజ్జెల ప్రసన్న,జవ్వాజి శ్రీనివాస్,చిదురాల రమేష్, షాహనవాజ్ ఖాన్,గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు



## ఎన్టీపీసీలో గ్రీన్ స్టెప్.. గ్రీన్ ఫ్యూచర్!!

### ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర)

భూమి మనకు ఇచ్చిన అమూల్యమైన వరం. ప్రకృతి మన జీవితానికి ప్రాణాధారం. ఆ పచ్చదనాన్ని కాపాడాలనే సంకల్పంతో ఎన్టీపీసీ రామగుండం మరియు తెలంగాణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, అసోసియేషన్ ప్రతినిధులు, జీఈఎం చిన్నారులు, కాంట్రాక్ట్ కార్మికులు ఒకే వేదికపై చేరి ప్రకృతితో తమ అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ అవగాహన ర్యాలీ సందేశాలతో మార్మోగింది. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక రోజు నిర్వహించే కార్యక్రమం కాదు, అది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి అని అన్నారు. మనం నేడు నాటిన ప్రతి మొక్క రేపటి తరాలకు అందించే అమూల్యమైన కానుక. ప్రకృతిని కాపాడడం ద్వారా మాత్రమే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది అని తెలిపారు. చిన్నారుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పచ్చని భవిష్యత్తుకు పునాది వేస్తూ టౌన్‌షిప్‌లో 200 మొక్కలను నాటగా, తెలంగాణ సీహెచ్‌పీ కోల్ భవన్‌లో మరో 100 మొక్కలు నాటారు. తెలంగాణ యాష్ డైక్ వద్ద మియావాకి విధానంలో 1000 మొక్కలతో సరికొత్త అరణ్య సృష్టికి శ్రీకారం చుట్టారు. వేగంగా ఎదిగి స్వయం సమృద్ధిగా మారే ఈ మియావాకి అడవి ప్రకృతి పునరుద్ధరణకు ప్రతీకగా నిలవనుంది. మొత్తం 1300 మొక్కల నాటకం ద్వారా పచ్చదనానికి ఎన్టీపీసీ తన అంకితభావాన్ని మరోసారి నిరూపించింది. ప్రకృతిని కాపాడితేనే మనుగడ సురక్షితమనే సందేశంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

## కోలేటి బర్త్‌డే సేవా కార్యక్రమాల సందడి

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర) :



రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి కోలేటి దామోదర్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తబిత ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం, కేక్ కటింగ్ నిర్వహించగా, ముఖ్య అతిథితులుగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కోలేటి సోదరులు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోదావరిఖనిలోని అమ్మ పరివార్‌లో నిరుపేదలకు అన్నదానం చేశారు. అతిథులు మాట్లాడుతూ, కోలేటి దామోదర్ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ప్రజా సేవలో ఆయన చేసిన కృషి, పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది అని, సమాజ సేవను తన జీవిత లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న దామోదర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాను అని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు అన్వేష్, రామగుండం పట్టణ మహిళా సోదరీమణులు, 26వ డివిజన్ కార్పొరేటర్ సారయ్య నాయక్, మాడిశెట్టి రవీందర్, సబ్బు శంకర్, ముత్యాల శంకర్, గుజరాత్ రామకృష్ణ, జాపతి శ్రీనివాస్, వెంకటేష్, నిఖిల్, అరవింద్, సాగర్, సాయి చరణ్, అక్షిత్, వినయ్ తదితరులు పాల్గొని దామోదర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

# చిన్నారుల కిలకిలలు..సర్కారు బడుల కళకళలు

**- ప్రభుత్వ స్కూళ్ళలో 'ప్రీ-ప్రైమరీ' వరం..**
**- ఊరూరా బడిబాట.. పల్లె పల్లెకూ చైతన్యం**
**- పెద్దాపూర్ బడిబాటలో సరికొత్త విప్లవం..**
**- ఇక ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎల్‌కేజీ, యూకేజీ**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : ఒకప్పుడు కార్పొరేట్ స్కూళ్ల ఫీజులు కట్టలేక, పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేస్తూ అల్లాడిపోయిన కన్నప్రేమల కథలన్నీ ఇక గతం. అమ్మ ఒడి లాంటి ప్రభుత్వ బడి.. ఇప్పుడు సరికొత్త హంగులతో, ఆధునిక ముస్తాబుతో చిన్నారులను రమ్మని పిలుస్తోంది. "అక్షరం" పురిటిగడ్డపై సర్కారు వేసిన సరికొత్త అడుగు.. మధ్యతరగతి, పేద కుటుంబాల పాలిట అక్షరాలా ఒక వరం.

### ర్యాలీగా కదిలిన పెద్దాపూర్.. పల్లె పల్లెకూ బడిబాట

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామం నేడు సరికొత్త ఉత్సాహంతో ఉరకలెత్తింది. "బడిబాట" కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఏకమై ఊరేగింపుగా కదిలారు. ప్రతీ ఇంటి తలుపూ తట్టి, ప్రతి తల్లిదండ్రుల కళ్లల్లో ఆశల దీపాలు వెలిగించారు. లక్షల ఫీజుల ప్రైవేట్ మాయలో పడకండి..మన పెద్దాపూర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నాణ్యమైన చదువును ఉచితంగా అందుకోండి అంటూ ఉపాధ్యాయులు ఊరంతటా చైతన్యాన్ని నింపారు.

### ప్రభుత్వ బడిలోనే ప్రీ-ప్రైమరీ

ఈ ఏడాది బడిబాట కేవలం ప్రచారానికే పరిమితం కాలేదు, ఒక సరికొత్త చరిత్రకు నాంది పలికింది. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ (ప్రీ-ప్రైమరీ) తరగతులు ప్రారంభమవుతున్నాయి అనే వార్త తల్లిదండ్రుల్లో అమితానందాన్ని నింపింది.ఇకపై చిన్నారుల ముద్దులొలికే కేకలు, అమాయకపు నవ్వులు మన సర్కారు బడిలోనే వినపడనున్నాయి. ప్రైవేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోని విధంగా, ఆటపాటలతో కూడిన మోడరన్ ఎడ్యుకేషన్‌ను ఉచితంగా అందించేందుకు బడి సిద్ధమైంది.

### కదంతొక్కిన ఊరు.. ఒక్కటైన జనం

ఈ అద్భుతమైన మహోత్సవంలో పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, వార్డు మెంబర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాగమయి, ఉపాధ్యాయులు ఆకుల రాజన్న, ఇతర ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సెంటిమెంట్‌ను, మోడరన్ విజన్‌ను జోడించి ఉపాధ్యాయులు చేసిన మోటివేషన్ చూసి.. ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్న తమ పిల్లలను ఈసారి ప్రభుత్వ బడికే పంపుతామని పలువురు తల్లిదండ్రులు సంతోషంగా ముందడుగు వేశారు.

### కన్నవారికి ఒకే ఒక్క మాట..!

అమ్మలు, నాన్నలు.. ఆలోచించండి! మీ బిడ్డల భవిష్యత్తుకు భరోసా, వారి మేధస్సుకు సరైన దిశ చూపేది మన ప్రభుత్వ బడే. రూపాయి ఖర్చు లేకుండా, కార్పొరేట్ స్థాయి విద్యను మీ ఊరిలోనే మీ పిల్లల కళ్లముందు అందించే ఈ అద్భుతమైన అవకాశాన్ని అస్సలు వదులుకోవద్దు. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి.. మీ చిన్నారులను సర్కారు బడికి పంపండి

# ప్రైమరీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**రామగుండంలో**
**8 ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు**
**ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకం**
**జూన్ 9 వరకు దరఖాస్తుల స్వీకరణ**
**ఎంఈఓ జింక మల్లేష్**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : రామగుండం మండలంలోని 8 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జింక మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పి.కె.రామయ్య కాలనీ, మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పోస్టుల కోసం ఎన్‌టీపీసీ జడ్‌పీహెచ్‌ఎస్ ప్రధానో పాధ్యాయులకు, మార్కండేయ కాలనీ, మల్లిఖార్జున్‌నగర్, గాంధీ పార్క్, విద్యుత్‌నగర్, రామగుండం, ఆటోనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పోస్టుల కోసం గాంధీ పార్క్ జడ్‌పీహెచ్‌ఎస్ ప్రధా నోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హతతో పాటు ఆధార్ కార్డు ద్వారా స్థానిక నివాస ధ్రువీకరణ కలిగి ఉండాలని, ఆయా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు స్థానిక నివాస ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం లోపు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమవుతున్న ప్రీ–ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా

# 'ఉత్తమ పాత్రికేయ పురస్కారప్రధానం

## జర్నలిస్ట్ బాశెట్టి హరీష్‌కు ఉత్తమ పాత్రికేయ పురస్కారం

మెట్ పల్లి జూన్ 05 (విజన్ ఆంధ్ర):
ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికారంగం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య బలమైన వారధిగా నిలుస్తోందని జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ అన్నారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో వార్షిక 'ఉత్తమ పాత్రికేయ పురస్కార' ప్రదానోత్సవం శు క్రవారం శ్రీకాళహస్తిలోని గంగా సదన్‌లో అత్యంత వైభవంగా జరిగింది.?ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్, శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీమతి ఉమ వెన్నం, ప్రముఖ జర్నలిస్ట్ బాశెట్టి హరీష్ కు 'ఉత్తమ పాత్రికేయ పురస్కారాన్ని' అందజేసి ఘనంగా సత్కరించారు.



### సత్యనిష్ఠతో కూడిన జర్నలిజం అభినందనీయం

ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ మాట్లాడుతూ.. సమాజంలోని అన్యాయాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం కలం యోధులుగా పోరాడే పాత్రికేయుల సేవలు అమూల్యమైనవన్నారు. సత్యనిష్ఠ, ధైర్యం, నిబద్ధతలతో విధి నిర్వహణ చేస్తూ, సమాజ చైతన్యానికి తోడ్పడుతున్న జర్నలిస్టులను గౌరవించుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు.?పురస్కార గ్రహీతలకు అభినందనలు దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే పాత్రికేయుల బాధ్యత ఎంతో కీలకమైందని అన్నారు. అవార్డు అందుకున్న బాశెట్టి హరీష్‌తో పాటు, ప్రతి ఏటా ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి దినపత్రిక సంపాదకులు నాంపల్లి శ్రీనివాస్, పలువురు ప్రముఖులు, భాషాభిమానులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

---

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



వేములవాడ, (విజన్ ఆంధ్ర) జూన్ 5:
వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇటీవల మృతిచెందిన నాగుల లస్మవ్వ గారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి గారు పరామర్శించారు.
ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి తన అండదండలు ఉంటాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఊరడి సునీత – రాజిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు నడిగోట్ల హరికృష్ణ, కట్ట తిరుపతి, వార్డు సభ్యులు ఎరుకల కిషన్, కట్ట ప్రవీణ్, అనుమూల మల్లేశం, వంకాయల కనుకయ్య, పార్వతి అంజయ్య తదితరులు పాల్గొన్నారు

## హరితహారానికి ముమ్మర ఏర్పాట్లు

### నర్సరీ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

వేములవాడ (విజన్ ఆంధ్ర బ్యూరో), జూన్ 5:
వేములవాడ పట్టణాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ యంత్రాంగం వన మహోత్సవానికి సన్నాహాలు ప్రారంభించింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచనల మేరకు పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా భారీ స్థాయిలో మొక్కల పెంపకం, నాటే కార్యక్రమాల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది.ఈ నేపథ్యంలో ఎల్లమ్మ ఆలయం సమీపంలోని స్వజాల దార బావి వద్ద మున్సిపల్ నర్సరీ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సుమారు 50 వేల మొక్కలు నాటే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రధాన రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాలు, కాలనీలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ముందస్తుగా నర్సరీలో మొక్కలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి వార్డులో నాటే మొక్కల సంఖ్య, వాటి సంరక్షణ బాధ్యతలు, పర్యవేక్షణ విధానంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో వేములవాడను హరిత పట్టణంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు తోట రాజు, కొండ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మేనేజర్ సంపత్ రెడ్డి, ఏఈ అనన్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుకుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



## టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ దృష్టికి ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి హామీ ఇచ్చిన కర్నాటి వరుణ్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల (విజన్ ఆంధ్ర), జూన్ 5:
టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన సందర్భంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఉద్యోగులు రెగ్యులర్ మేనేజింగ్ డైరెక్టర్ లేకపోవడం వల్ల పెండింగ్‌లో ఉన్న వార్షిక వేతన పెరుగుదల, ఏజీఐ (గూ+×) ఇంక్రిమెంట్లు, ఆర్జిత సెలవుల అప్పగింత, పిల్లల సంరక్షణ సెలవులు తదితర అంశాలను సీఎండీకి వివరించారు.ఉద్యోగుల సమస్యలను ఓపికగా విన్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, సంబంధిత అంశాలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు విద్యుత్ శాఖ ఉద్యోగులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.





## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. లక్ష్మణాచారి**

సిరిసిల్ల (విజన్ ఆంధ్ర బ్యూరో), జూన్ 5:
పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా భావించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి పి. లక్ష్మణాచారి అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ ఆదేశాల మేరకు శుక్రవారం సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మణాచారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారని, ప్రకృతి వనరుల సంరక్షణ, కాలుష్య నియంత్రణ, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.అనంతరం న్యాయమూర్తి లక్ష్మణాచారి న్యాయవాదులతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ కార్యదర్శి చి. వెంకటయ్య, సీనియర్ న్యాయవాది రవీందర్ రావు, ప్రభుత్వ న్యాయవాది కళ్యాణ్ చక్రవర్తి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, ఆడెపు వేణు, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు

## రాజకీయ చైతన్యంతో సుశిక్షిత కమ్యూనిస్టులుగా ఎదగాలి

**సీపీఐ సీనియర్ నాయకుడు,**

**మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**




వేములవాడ (విజన్ ఆంధ్ర బ్యూరో), జూన్ 5:
దేశంలో మారుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితులను లోతుగా అధ్యయనం చేస్తూ కార్యకర్తలు సుశిక్షిత కమ్యూనిస్టులుగా ఎదగాలని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిద్ధాంతపరమైన అవగాహన, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో శిక్షణా శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.వేములవాడలోని మహాదేశ్వర బ్యాంకెట్ హాలులో శుక్రవారం ప్రారంభమైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ కౌన్సిల్ సభ్యుల మూడు రోజుల రాజకీయ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ, జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పరిణామాలను అర్థం చేసుకోవడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలను సమర్థ నాయకులుగా తీర్చిదిద్దేందుకు రాజకీయ శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇటువంటి శిక్షణా శిబిరాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందని, కార్మికుల హక్కులను హరించేలా చట్టాల్లో మార్పులు చేస్తోందని విమర్శించారు. కేంద్ర పథకాల అమలులో రాష్ట్రాలపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు.తెలంగాణలో మతోన్మాద రాజకీయాలకు అవకాశం కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు సమాజానికి హానికరమని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, చెన్న విశ్వనాథం, మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, నియోజకవర్గ ఇంచార్జి కడారి రాములు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్, కె.వి. అనసూయ తదితరులు పాల్గొన్నారు

## శాత్రాజుపల్లి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

**కలెక్టర్, మైనింగ్ అధికారులకు గ్రామస్థుల వినతి**



వేములవాడ (విజన్ ఆంధ్ర బ్యూరో), జూన్ 5:
వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ చెరువులో అనుమతులకు విరుద్ధంగా భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్థులు, రైతులు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా మైనింగ్ అధికారికి శుక్రవారం ఫిర్యాదు చేశారు.గ్రామస్థుల కథనం ప్రకారం, చెరువు నుంచి 1000 క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే తరలించేందుకు జగిత్యాలకు చెందిన కాంట్రాక్టర్లు కావటి గంగధర్, బొడ్డుపెల్లి జగన్‌రాజుకు అనుమతి మంజూరైంది. అయితే గత ఐదు రోజులుగా మూడు పోక్లెయిన్లు, సుమారు 50 టిప్పర్ల సహాయంతో అనుమతికి మించి మట్టిని తరలిస్తున్నారని వారు ఆరోపించారు.ఇప్పటికే సుమారు 10 వేల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టిని తరలించినట్లు పేర్కొంటూ, ఈ తవ్వకాల వల్ల చెరువులోని నల్లమట్టి పూర్తిగా తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గ్రామ ప్రజలు, రైతులకు అవసరమైన మట్టి అందుబాటులో లేకుండా పోతుందని తెలిపారు.అనుమతుల ఉల్లంఘనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చెరువులో కొనసాగుతున్న మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని గ్రామస్థులు జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులను కోరారుఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గుడిసె సదానందం, మాజీ ఉపసర్పంచ్‌లు రేగుల రాజేశం, నల్ల సతీష్ రెడ్డి, మ్యాకల శ్రీనివాస్, గుడిసె అనిల్, శివ శ్రీనివాస్, మ్యాకల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

## మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్



వేములవాడ (విజన్ ఆంధ్ర), జూన్ 5:
పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, హరిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి చైర్మన్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. మొక్కలు కాలుష్య నియంత్రణతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణకు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణంలో 50 వేల మొక్కలు నాటేందుకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మేనేజర్ సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు



## కుల సంఘాల అభివృద్ధి కి ప్రత్యేక కృషి

రుద్రంగి జూన్ 5, (విజన్ ఆంధ్ర ):
మండల కేంద్రంలోని ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణం కోసం 3 లక్షల 50 వేల నిధులు,ముంజ లక్ష్మీనరసింహస్వామి ప్రహరీ గోడ నిర్మాణానికి 2లక్షల 50 వేల నిధులు,వడ్ల కమ్మరి సంఘం వద్ద 1లక్ష 80 వేల నిధులతో బోర్ మోటార్ మంజూరు కాగా ప్రొసీడింగ్ కాపీని శుక్రవారం గ్రామ సర్పంచ్ గండి నారాయణ స్థానిక నాయకులతో కలిసి వారి వారి సంఘ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో గ్రామంలోని కుల సంఘాల ఆలయాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం జరిగిందని,కుల సంఘాల సభ్యులు అడిగింది తడవుగా నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి కి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే కు కుల సంఘాల సభ్యులు ఋణపడి ఉండాలని అన్నారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో రుద్రంగి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు.అనంతరం కుల సంఘాల సభ్యులు మాట్లాడుతూ.తమ సంఘ భవనాలతో పాటు ఆలయాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో,ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్,మండల అధ్యక్షుడు ఎర్రం గంగానర్సయ్య,మాజీ జడ్పీటిసి గట్ల మీనయ్య, నాయకులు గడ్డం శ్రీనివాస్,కొమిరె శంకర్,తర్రె లింగం,పల్లి గంగాధర్,ద్యావల రవి,గుగ్గిళ్ల వెంకటేష్,కట్కూరి దాసు,ఎర్రం అరవింద్,అంబటి శ్రీనివాస్,దయ్యాల శ్రీనివాస్,దాసరి గంగరాజం,పాల నర్సయ్య మరియు తదితరరులు పాల్గొన్నారు.

## రుద్రంగి, మానాల ప్రభుత్వ పాఠశాలలో నియమకాలు

రుద్రంగి , జూన్ 5, ( విజన్ ఆంధ్ర):
రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2026–27 విద్యా సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ పథకం కింద మంజూరైన ప్రీ–ప్రైమరీ పాఠశాలలలో ఇన్‌స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టుల భర్తీకి జిల్లా విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రుద్రంగి మండల విద్యాధికారి శ్రీ ఎన్. రామకృష్ణ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 48 ప్రీ–ప్రైమరీ పాఠశాలలలో 48 ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు, 48 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రుద్రంగి మండలంలోని ఎంపీపీఎస్ మానాల,ం ఎంపీపీఎస్ రుద్రంగి పాఠశాలలలో కూడా ఈ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు డిప్లొమా ఇన్ ప్రీ–స్కూల్ ఎడ్యుకేషన్/సమాన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఎంపికైన వారికి నెలకు రూ.8,000 గౌరవ వేతనం అందజేయబడుతుందని తెలిపారు.ఆయా పోస్టులకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించగా, ఎంపికైన వారికి నెలకు రూ.6,000 గౌరవ వేతనం చెల్లించబడుతుందని వివరించారు.అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు అదనంగా 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద లేదా మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు పత్రాలను పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను 09–06–2026 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని సూచించారు.దరఖాస్తుల స్వీకరణ 06–06–2026 నుండి 09–06–2026 వరకు జరుగుతుందని, మెరిట్ జాబితా 13–06–2026న, తుది ఎంపిక జాబితా 15–06–2026న ప్రకటించి, ఎంపికైన అభ్యర్థులకు 16–06–2026న నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు మండల విద్యాధికారి శ్రీ ఎన్. రామకృష్ణ తెలిపారు.

## జనవాసాల మధ్య పందుల విహారం

### పలుమార్లు విన్నవించిన పట్టించుకోని అధికారులు...



రుద్రంగి జూన్ 5 (విజన్ ఆంధ్ర ):
జనవాసాల నడుమ పందుల స్వైర విహారం చేస్తున్నడంతో అంటు వ్యాధుల భారిన పడుతున్నామని కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని 15వ వార్డులో పందులు విచ్చలవిడిగా తిరగడంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. స్థానిక వార్డులో మురికి కాలువలు నిర్మించిన వాటిని శుభ్రం చేయకపోవడంతో నిండుగా మట్టి కుడుకపోయి దుర్వాసన వెదజల్లుతుందని, పిల్లల్ని బయటకు పంపాలంటేనే భయపడుతున్నామని అన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదంటూ కాలని వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఎన్నిసార్లు పంచాయతీ పాలకవర్గానికి తెలియజేసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ పందులు విచ్చలవిడిగా తిరగడం తో పాటు మురికి కాలువల అపరిశుభ్రత ల వల్ల దోమలు వ్యాప్తి చెంది వ్యాధుల భారిన పడే అవకాశం ఉందంటూ కాలని వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల స్వైర విహారం, మురికి కాలువ శుభ్రత లపై తగిన చర్యలు చేపట్టాలని 15 వ వార్డు ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



## బొమ్మ, పొన్నంలతో కవ్వంపల్లి భేటీ

మానకొండూరు. జూన్ 5. విజన్ ఆంధ్ర
ఎల్ఎండి కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ సందర్శించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కరీంనగర్ జిల్లా కేంద్రానికి శుక్రవారం వెళుతూ మార్గ మధ్యలో ఎల్ ఎం డి లోని క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారికి టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సాదరంగా ఆహ్వానం పలుకుతూ శాలు వాలతో సన్మానించారు.అనంతరం వారితో డాక్టర్ కవ్వంపల్లి కొద్దిసేపు భేటీ అయ్యారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కొండూరి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితెల ప్రణవ్ బాబు, జిల్లా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పార్టీ నాయకులు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, బండారి రమేష్, మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి,మామిడి అనిల్ కుమార్, ఆకారపు భాస్కర్ రెడ్డి, పడాల రాహుల్, కర్ర ప్రసన్న రెడ్డి, పులి ఆంజనేయులు బండారి తిరుపతి, ఎం.జీవనజ్యోతి,కర్ర రాజశేఖర్, ఆరెపల్లి రాజేందర్, నగేష్ ముదిరాజ్, ప్యాట రమేష్, ఆకుల ప్రకాష్, రహమత్, తాజ్, మడుపు మోహన్, అంజనీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య..

### గూడెం గ్రామంలో విషాదం

ముస్తాబాద్,(విజన్ ఆంధ్ర)



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది.గ్రామానికి చెందిన ఆవునూరి దేవానందం (60), తండ్రి భూమయ్య, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తన ముగ్గురు కుమార్తెల వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురై కొంతకాలంగా ఆందోళన చెందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ప్రతిరోజూ సాయంత్రం తన పొలం వద్దకు వెళ్లి పాలు పిండుకొని పాల సేకరణ కేంద్రానికి వెళ్లడం దేవానందం దినచర్యగా ఉండేది.ఇదే విధంగా జూన్ 4న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు.శుక్రవారం ఉదయం (జూన్ 5) ఆయన భార్య పొలం వద్దకు వెళ్లి వెతకగా, పొలం సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని వేలాడుతున్న స్థితిలో కనిపించాడు. వెంటనే కుమారుడికి సమాచారం ఇవ్వగా, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని చూడగా అప్పటికే దేవానందం మృతి చెందినట్లు గుర్తించారు.తన తండ్రి మరణంపై ఎవరి పట్లా ఎలాంటి అనుమానం లేదని కుమారుడు ఆవునూరి బానోదం పోలీసులకు తెలిపాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ జి. జ్యోతి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు

## నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ కు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

విజన్ ఆంధ్ర :చిగురుమామిడి



జాతీయ స్థాయి నేషనల్ మీన్స్–కమ్–మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష -- 2025 లో తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్, ముల్కనూర్ విద్యార్థిని వి. కావ్య శ్రీ ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసిన ఎంపిక జాబితాలో కావ్య శ్రీ పేరు చోటు దక్కిందని ఈ విజయం విద్యార్థిని కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని పాఠశాల ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ తెలిపారు.

## ప్రధాని మోదీ దూరదృష్టి వల్లే

## దేశం ఆర్థికంగా స్థిరంగా ముందడుగు

### బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర.....

కరీంనగర్ (విజన్ ఆంధ్ర) జూన్ 05.



పర్యావరణాన్ని రక్షించడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని , పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని మోదీ "మాకే నామ్ పర్ ఏక్ పేడ్ "(అమ్మ పేరుతో ఒక చెట్టు,) అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం , అమ్మ గౌరవార్థం , జ్ఞాపకార్థం ఒక చెట్టును పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఆలోచనను ప్రజల్లో మోది రేకెత్తించారని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. ప్రధాని మోదీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా , ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని , ప్రధాని మోదీ పిలుపుమేరకు మాకే నామ్ పర్ ఏక్ పేడ్ (అమ్మ పేరుతో ఒక మొక్క ) నాటే కార్యక్రమం శుక్రవారం రోజున అలుగునూర్ పరిధిలోగల 133,134 పోలింగ్ బూత్ లో చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో బిజెపి శ్రేణులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్యావరణ పరిరక్షణ కోసం అనేక చర్యలు చేపట్టిందని , ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా దేశవ్యాప్తంగా అమ్మ పేరుతో ఒక మొక్కను నాటే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రధాని పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అమ్మ పేరుతో ఓ మొక్కను నాటే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. అంతర్జాతీయ కంపెనీలు భారత్ వైపు చూసేలా 'మేక్ ఇన్ ఇండియా' పరిధిని పెంచుతూ, భవిష్యత్తులో రాబోయే ఆర్థిక సవాళ్లను తట్టుకునేలా దేశీయ పరిశ్రమలను కేంద్రం బలోపేతం చేస్తోందని ఆయన వివరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ ప్రజల రక్షణ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా తెలంగాణ విభజన రాజకీయాలు చేస్తుందని ఆయన ఘాటుగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచిన ఇంకా ప్రాంతీయ విద్వేషాలు , రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రాజకీయాలు చేస్తుందని , ఇది తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. జనసేన అధినేత , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం , మంత్రులు , కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. ప్రభుత్వం విధించిన ఆంక్షలు , నిర్బంధాలతో తెలంగాణలో స్వేచ్ఛాయుత వాతావరణం లేదనే భావన ఏర్పడుతుందని ఏర్పడుతుందని , దీనివల్ల తెలంగాణ భవిష్యత్తుకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో అంతర్భాగమేననే విషయాన్ని మరిచి కాంగ్రెస్ నేతలు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ఈ ప్రోగ్రాంలో బిజెపి బూత్ అధ్యక్షులు చిందం అంజి , నాయకులు కొత్తూరి శ్రీనివాస్ , జయంత్, సాయి తదితరులు పాల్గొన్నారు

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు
# రాజకీయ పార్టీలు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఈ.వి. ఎమ్ గోదాం తనిఖీ

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్05



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వ హించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా మాట్లాడుతూ ఈవియం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలనీ సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోడౌన్ లను క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోడౌన్ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈవియం గదులను వి వి ప్యాట్ స్టోరేజీ విధానాన్ని పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ అదరపు కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏన్, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్ ,బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ , సిపియం పార్టీ ప్రతినిధి డి, నరేష్ పటేల్, ఏఐఎంఐఎం పార్టీ ప్రతినిధులు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, బిజెపి పార్టీ ప్రతినిధి బి సాయికృష్ణ ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం



కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 05.

నగర ప్రజలకు మరిన్ని ఆధునిక వసతులు కల్పించడంలో భాగంగా కరీంనగర్ నగరంలో నూతనంగా అధునీకరించిన ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కరీంనగర్ నగరపాలక సంస్థకు చెందిన కాంప్లెక్స్ భవనాన్ని శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ సుడా కు చెందిన 79 లక్షల నిధులతో 48 షాపులుగా అధునీకరించిన ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ను శుక్రవారం రోజు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వడ్లూరు లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, స్థానిక శాసనసభ్యులు గంగుల కమలాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వనీ తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రారంభం చేశారు. అనంతరం సుడాకు చెందిన 1.28 కోట్ల రూపాయల నిధులతో నైట్ ఫుడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం కు శంఖు స్థాపన చేశారు. నైట్ ఫుడ్ కోర్ట్ కాంప్లెక్స్ స్టాల్స్ నిర్మాణంతో పాటు పార్కింగ్ స్థలం, బెంచెస్ ఏర్పాటు, పిల్లల ఆట పరికరాలు, వాటర్ ఫౌంటెన్ లాంటి వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేషం, మున్నూరు కాపు కార్పోరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, ఆర్టీఎ మెంబర్ పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, స్థానిక కార్పోరేటర్ వంగల పవన్, (మాజీ మేయర్) కార్పోరేటర్ రవీంధర్ సింగ్, కార్పోరేటర్లు వైద్యుల అంజన్ కుమార్, వరాల నర్సింగం చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, సరిల్ల రాజకుమారి ప్రసాద్, అలీ, మల్లేషం, నగరపాలక సంస్థ, సుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణ రక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 05..పర్యావరణ పరిరక్షణకు మనమందరం బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక, అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని డీర్ పార్కులో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి , చీఫ్ కన్జర్వేటివ్ ఆఫీసర్ క్షితిజ, వివిధ శాఖల అధికారులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. వచ్చే నాలుగు నెలల్లో విరివిగా మొక్కలు నాటేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. నాణ్యమైన మొక్కలను నర్సరీలో పెంచుతున్నామని అన్నారు. కాలుష్య రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని పేర్కొన్నారు.సీపీ మాట్లాడుతూ మన పూర్వీకులు మనకు కోసం మొక్కలు నాటినట్లు.. మనం భావితరాల కోసం మొక్కలు నాటి మంచి వాతావరణం అందించాలని పేర్కొన్నారు.మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరపాలిక పరిధిలో ఆరు నర్సరీలు ఏర్పాటు చేశామని.. ఇంటింటికి మొక్కలు అందిస్తామని 7.50 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.చీఫ్ కన్జర్వేటివ్ ఆఫీసర్ క్షితిజ మాట్లాడుతూ.. అవర్ క్లైమేట్ అవర్ ఫ్యూచర్ నేచర్ ఈజ్ ఇన్స్పిరేషన్ అని థీమ్ తో ఈ సంవత్సరం పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పార్కుల్లో మొక్కలు నాటాలని కేంద్రం నిర్ణయించిందన్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే.. ప్రకృతి మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే మాట్లాడుతూ పర్యావరణ రక్షణకు పాఠశాలల్లో ఎల్పిజి గ్యాస్ సిలిండర్ లోనే వినియోగిస్తున్నట్లు తెలిపారు. మనం ఏదోరకంగా పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించడం ముఖ్యమని.. కాంక్రీట్ జంగిల్ కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు.అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగంతో నష్టాలు, పచ్చదనం ప్రాముఖ్యత వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణరావు, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 05.

పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని , పర్యావరణాన్ని రక్షించకపోతే భవిష్యత్ తరాలకు భద్రత లేదని , అందుకే భవిష్యత్ తరాలకు పచ్చని భూమిని అందించడానికి ప్రతి ఒక్కరి కృషి చేస్తేనే రేపటికి భద్రత ఉంటుందని మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణరావు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జ్యోతి నగర్ లో గల గణేష్ మండపం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన పంచభూతాల కలయికే మన పర్యావరణం అని, అయితే, ఆధునిక మానవుడి స్వార్థం, మితిమీరిన సాంకేతికత, పారిశ్రామికీకరణ వల్ల నేడు పర్యావరణం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందన్నారు. గ్లోబల్ వార్మింగ్ (భూతాపం), అడవుల నరికివేత, ప్లాస్టిక్ కాలుష్యం వంటి సమస్యలు భూమి ఉనికికే ప్రమాదకరంగా మారాయన్నారు..పర్యావరణాన్ని రక్షించుకోవడానికి భవిష్యత్ తరాలను కాపాడుకోవాల్సిన పరిస్థితులు అవసరం ప్రస్తుతం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా పర్యావరణాన్ని రక్షించుకోవడానికి మొక్కలను నాటడం, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం, జల సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం , వ్యర్థాల నిర్వాణపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించకపోవడంతో నేడు నిప్పుల కొలిమిలా వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రస్తుతం ఉన్న విపరీతమైన ఎండలు, వడగాల్పులే ఇందుకు నిదర్శనం అన్నారు. బొగ్గు ,పెట్రోల్ డీజిల్ తో నడిచే వాహనాల తో తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడుతుందని, అందుకే ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని సూచించారు. ప్రకృతిని వినియోగించుకోవాలని, సోలార్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. చెట్లను విరివిగా పెంచినప్పుడే ప్రాణవాయువు లభిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మానేరు పర్యావరణ సమితి .



బండి శ్రవణ్ కుమార్. తోట లక్ష్మణ్ రావు. వేముల రవీందర్.వి. సుగుణాకర్ రెడ్డి. ప్రవీణ్ రెడ్డి. రుద్ర లక్ష్మణ్. గుజ్జా శ్రీను. మాటూరి వెంకట స్వామి. సత్య నారాయణ.తోట రాజేందర్. పిట్టల మధుసూదన్. దయ్యాల మల్లేశంలతోపాటు డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు